# మా ఇంటి మహాలక్ష్మి? మందారప్పూ మాలక్ష్మి?

ఆ ఇంటి వాతావరణం తుఫాన్ ముందు ప్రశాంతతలాగ అతి ప్రశాంతంగా వుంది.

రాజారావు రాకతో, అంతవరకు హోరాహోరిగా వాదించుకున్న అన్నపూర్ణ, లలితల నోర్లు టక్కున మూత బడ్డాయి

అంతవరకు ఏడ్చిన గుర్తుగా అన్నపూర్ణ కళ్లు ఎఱ్ఱగా ఉబ్బిపోయి ఉన్నాయి లలిత కళ్లలో సన్నటి ఎఱుపు జీరలు, అదిరే ముక్కుపుటాలు, ఆమె మనసులో రగిలే కోపాగ్నిని సూచిస్తున్నట్లున్నాయి

కొడుకును చూడగానే పైట కొంగుతో కన్నీటిని తుడుచుకొని లోపలకి నడిచింది అన్నపూర్ణ!

భర్త రాకతో శాంతాన్ని కొనితెచ్చుకొని, కాఫీ కలపడానికి వంటగదిలోకి నడిచింది లలిత

"లలితా! మళ్లీ ఏమైంది? ఆ గంభీర వాతావరణాన్ని భరించలేక అడిగాడు రాజారావు

"ఏమీ లేదు లెండి మీ అమ్మగారికి ఈ సంబంధం ఇష్టంలేదట! ఎలాగైనా ఈ పెళ్లి జరగడానికి వీల్లేదని ఏడుస్తూ కూర్చుంది ఆవిడ పాతకాలం మనిషి. ఆవిడ భావాలని, మూఢ నమ్మకాలని ఎదుటవాళ్ల మీద రుద్దాలని చూస్తుంది అంది కోపాన్ని అణుచుకొంటూ!

"అన్ని మాటలు జరిగిపోయాక ఇప్పుడలా అంటే ఏం బాగుంటుంది" చికాగ్గాఅన్నాడు రాజారావు

"అదేదో మీ అమ్మగారికి చెప్పండి విసుగ్గా కాఫీ అందించి అక్కడనుండి వెళ్లిపోయింది లలిత!

కాఫీ అందుకొని మెల్లమెల్లగా సిప్ చేస్తున్నాడు రాజారావు

ఇంతలో అన్నపూర్ణ వచ్చి అక్కడ నిలబడింది

"ఏమిటమ్మా! ఏం జరిగింది? అలా ఉన్నావేంటి? అడిగాడు రాజారావు తల్లి ముఖంలోకి చూస్తూ!

'ఒరే రాజా! నాది చాదస్తమని, మూఢ నమ్మకమని అనుకోకపోతే, నేను చెప్పినట్లు చెయ్యరా!" అంది అన్నపూర్ణ ఉపోద్ఘాతంగా!

"ఏమిటమ్మా! కిషోర్ పెళ్లి గురించేనా"

'ఔనురా! ఆ సంబందం నాకేం ఇష్టపడలేదు

"ఎందుకిష్టపడలేదు? పిల్ల బంగారపు బొమ్మలాగ వుంది అందానికి అందం ఉంది చదువుకు చదువు వుంది కట్న, కానుకలలో మనకేం లోటు జరగనివ్వరు ఇంకా ఏమిటమ్మా నీకు నచ్చనిది?" విసుగ్గాఅన్నాడు

"అదికాదురా! ఆ పిల్ల నష్ట జాతకురాలేమో ననిపిస్తుంది"

"ఏమిటమ్మా నీ మాటలు?" కోపంగా అన్నాడు

"అలా కోపగించుకొంటే నేనేం చెప్తాను ఆ పిల్లని చూడ్డానికి వెళ్లి, టైఫాయిడ్ జ్వరంతో, నెల్లాళ్లు మూసిన కన్ను తెరవలేదు కిషోర్! ఇప్పుడు ప్రధానం చేసుకొంటానని బయలుదేరుతున్నారు రేప్రొద్దున ఏది ఎలా జరిగినా, కిషోర్కే నష్టం- ఒక్కగానొక్క బిడ్డ వాడికేమైనా జరిగితే నేను భరించలేను' ఆవేదనగా అన్నది అన్నపూర్ణ

"అమ్మా నీదంతా ఒఠ్ఠి అనుమానం. వాడికి ఆ సమయంలో అలా రావాలని వుంది వచ్చింది దానికి ఆ పిల్లని ఆడిపోసుకోవడం అన్యాయం ఇదే మన ఆడపిల్లకి జరిగితే నువ్వు ఇలా మాట్లాడేదానివా!" అన్నాడు తెలిగ్గాకొట్టిపారేస్తూ!

'అలా చెప్పండి. నేను ఇంతసేపూ చెవిని ఇల్లు కట్టుకొని చెప్పాను నాది అంతా తొందరతనమట! నాకు పెద్దల మాట లెఖ్ఖలేదట!, అక్కడికి కిషోర్ ఆమెకే మనవడు. నాకు కన్నబిడ్డ కాదు అన్నట్లు మాట్లాడుతున్నారు' అంటూ వచ్చింది లలిత!

'ఏమో బాబూ! బొత్తిగా ఈ ఇంట్లో పెద్దవాళ్లంటే గౌరవం లేకుండాపోతుంది పెద్దదాన్ని ఎందుకు చెప్తున్నానో అన్న ఆలోచన కూడా లేకుండా ప్రొద్దుటి నుండి నాతో వాదించుకొని కూర్చుంది' అని అక్కడ నుండి కదిలింది అన్నపూర్ణ.

'లలితా ఎందుకు నోరు పారేసుకుంటావు? అమ్మ ఎంత బాధపడుతుందో తెలుసా?" చిరాగ్గాఅన్నాడు!

"ఔనండి! ఈవేళ ఆవిడ బాధపడుతుందని, మనం ఆ సంబంధం కాదంటే, ఆ తర్వాత జీవితాంతం కిషోర్ బాధపడతాడు వాడికి, మనకి అందరికి నచ్చిన ఆ అమ్మాయిని, ఇంత చిన్న కారణంతో కాదనడం మర్యాద అనిపించుకోదు. ఇలా సంబంధం తప్పిపోయిందంటే ఆ పిల్ల కెంత అప్రదిష్ఠ" ఆ పిల్ల ఉసురు పోసుకొని, మనం సుఖంగా సంసారం చెయ్యగలమా! చెప్పండి" అంది లలిత

"సరేలే! నేనిప్పుడు కాదన్నానా! అమ్మకి నేను నెమ్మదిగా నచ్చచెప్తాలే! మనం రేపే బయలుదేరి వెళ్దాం ప్రధానం చేసుకుని, ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకోవాలో నిర్ణయించుకొని వచ్చేదాం అని అక్కడ నుండి కదిలాడు రాజారావు

* * * * * * * *

ఆ మర్నాడు ట్రైన్కి బయలుదేరారు రాజారావు, లలిత, కిషోర్!

అన్నపూర్ణ ఎంత రమ్మన్నా రాలేదు.

"ఈ సంబంధం నాకు ఇష్టంలేదు ఎందుకో నా మనసు కీడు శంకిస్తోంది నేనిక్కడే ఉంటాను మీరు వెళ్లిరండి' అంది అన్నపూర్ణ!

ఆటోలో రైల్వేస్టేషన్కి బయలుదేరినవాళ్లు గంట తిరిగేసరికల్లా, తిరిగొచ్చేసరికి ఆశ్చర్యపోయింది అన్నపూర్ణ!

"మళ్లీ తిరిగొచ్చేశారేం? ట్రైన్ దొరకలేదా!" ఆశ్చర్యంగా అడిగింది అన్నపూర్ణ!

లలిత కళ్లలో ఎంత దాచుకుందామన్నా కన్నీరు దాగలేదు

అత్తగారి మాటకు ఏమీ జవాబు చెప్పలేక, నోటికి అడ్డంగా పైట కొంగు కుక్కుకొని ఏడవ సాగింది లలిత

రాజారావుగారు ముఖం వ్రేలాడేసుకొని, పది లంఖణాలు చేసినట్లు నీరసంగా ఉన్నాడు

"ఏమయ్యిందంటే లలిత అలా ఏడుస్తుందేమిటి? అసలు జరిగిందేమిటో చెప్పండి. నాకు గుండె అదురుతున్నాయి" అంది అన్నపూర్ణ ఆందోళనగా!

"అమ్మా! నీ మాట వినలేనందుకు మంచి శాస్తి జరిగింది. మేం వెళ్లే ఆటోకి ఏక్సిడెంట్ అయ్యింది మేమిద్దరం చిన్నగాయాలతో ఎలాగో బయట పడ్డాం మమ్మల్ని రక్షించబోయి, కిషోర్ ప్రాణాలమీదికి తెచ్చుకున్నాడు వాడికి బాగా దెబ్బలు తగిలాయి ఇప్పుడే ఆస్పత్రిలో చేర్చి వస్తున్నాము" అన్నాడు రాజారావు పూడుకుపోయిన గొంతుతో!

'ఏమిటిరా ఏమిటి? నువ్వంటున్నది? నా బాబుకేం జరిగింది? మొదటి నుంచి మొత్తుకుంటూనే ఉన్నాను నా మాట మీరిద్దరూ వినిపించుకోలేదు అయ్యో భగవంతుడా! ఇప్పుడు నాకేం దారి? అన్యాయంగా నా మనవడిని నాకు దూరం చేస్తావా!" అంటూ ఏడవసాగింది అన్నపూర్ణ!

"అమ్మా ఎందుకలా బాధపడతావు? వాడి ప్రాణానికేం భయంలేదని డాక్టర్లు చెప్పారు ఏదో కొద్దిగా గాయాలు తగిలాయంతే!" అని ఆమెకు ధైర్యం చెప్పాడు రాజారావు

'ఏమోరా! ఆ ముదనష్టపు సంబంధం అనుకొన్న దగ్గరనుండి అన్నీ అపశకునాలే! రేప్రొద్దున్న ఆ పిల్లను పెళ్లిచేసుకుంటే, నా మనవడు నాకు దక్కడేమో! నా మాట విని ఇప్పటికైనా ఆ సంబంధం వదులుకోమని చెప్పరా కిషోర్కి" అంది అన్నపూర్ణ

"ఆ సంగతి తర్వాత ఆలోచిద్దాం ముందు ఆస్పత్రికి వెళ్దాం పద!" అన్నాడు రాజారావు.

"ఏడుకొండలవాడా! నా మనవడిని నాకు దక్కిస్తే, తల నీలాలు ఇచ్చుకుంటాను" అని దేముడికి దణ్ణం పెట్టుకొని అక్కడనుండి కదిలింది అన్నపూర్ణ!

* * * * * * * *

ఆ తర్వాత మూడు నెలలకుగాని, కిషోర్ లేచి తిరగలేకపోయాడు.

అన్నపూర్ణ మాటల ప్రభావం వల్లో, జరిగిన అపశకునాలవల్లో, రాజారావు, లలితల మనసులో కూడా భయం చోటు చేసుకుంది. కిషోర్ మనసుకూడా ఈ సంఘటనతో మారిపోయింది

ఫలితంగా రాజారావు ఈ సంబంధం నచ్చలేదని వదులుకున్నాడు.

ఆ తర్వాత మరో సంబంధం చూసి, కిషోర్ పెళ్ళి దివ్యంగా జరిపించేసారు

అన్నపూర్ణ తృప్తిగా నిట్టూర్చింది.

కిషోర్ క్షేమంగా ఉంటే, తిరుపతి వస్తానని మొక్కుకున్న అన్నపూర్ణ, కొడుకు, కోడలు, మనవడు, కొత్త కోడలితో తిరుపతి బయలు దేరింది.

మొక్కు బడి తీర్చుకొని అందరూ క్షేమంగా ఇంటికి తిరిగివచ్చారు.

ఆ రోజు ఎదరింటి మేడలో సందడిగా వుంది

ఆ తర్వాత ఆ ఎదురింటి మేడలో ఉండే సుజాత వచ్చి "మా అబ్బాయి పెళ్ళికి మీరు ఊర్లో లేరు అనుకోకుండా ఈ పెళ్ళి జరిగిపోయింది. మా కోడలిని చూడ్డానికి రండి" అని పిలిచేసరికి, బయలుదేరక తప్పలేదు.

అన్నపూర్ణ కూడా ఆ ఇంటి కొత్త కోడలిని చూడాలని ఉత్సాహంగా బయలుదేరింది.

ఆ ఇల్లంతా సందడి సందడిగా వుంది. విద్యుద్దీపాల అలంకరణలతో, ఆ మేడ దేవేంద్ర భవనంలాగ వెలిగిపోతోంది

కొత్త కోడలు వస్తే, ఇంత ఆర్భాటమెందుకో లలితకు అర్థంకాలేదు.

లలితను చూడగానే, సాదరంగా ఆహ్వానించింది సుజాత!

పెళ్ళికూతురు ఎక్కడా కనపడకపోయేసరికి, "అమ్మాయేది?" అని అడిగింది ఉండబట్టలేక!

"ఇంకా ముస్తాబు కాలేదు. అమ్మాయికి జడ కుడుతున్నారు. మీరలా కాస్సేపు కూర్చోండి" అని సోఫా చూపించి, ఆమె ప్రక్కనే తనూ కూర్చుంది

లలిత, అన్నపూర్ణ ఏం మాట్లాడాలో తోచక దిక్కులు చూస్తున్నారు.

ఇంతలో ఎవరో రావడంతో "వచ్చావా సుమిత్రా!" అంటూ ఆమెను ఆహ్వానించడానికి లేచింది సుజాత!

"ఏమిటి సుజా! నాకు చెప్పకుండానే కొడుక్కి పెళ్ళి చేసేసావు. ఇంకా నయం కోడలిని చూడ్డానికైనా రమ్మన్నావు". అందామె నిష్ఠూరంగా!

"ఏమిటో నే! అంతా అర్జంటుగా జరిగిపోయింది. ఆ అమ్మాయి నిజంగా అదృష్టవంతురాలు. లేకపోతే, ఎవరినీ ఇష్టపడని, మా రాజేంద్ర ఆ అమ్మాయిని చూడ్డంతోనే ఇష్టపడ్డాడు. అయినా ఈ సంబంధం అనుకొన్న దగ్గర నుండి, మాకంతా మంచే జరుగుతోంది మేం నిశ్చయ తాంబూలాలు పుచ్చుకొన్నాం. రాజేంద్రకి ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది ఆ అమ్మాయి మెడలో మూడు ముళ్ళు వేసాడు. మా వారికి వ్యాపారంలో లక్ష రూపాయలు లాభం వచ్చింది. ఈవేళ మా కోడలు నట్టింట్లో అడుగు పెట్టింది, భాగ్యలక్ష్మి మా ఇంటి తలుపు తట్టింది. రాజేంద్రకి రెండు లక్షలు లాటరీలో వచ్చాయి అందుకనే మా కోడలికి ఇంత ఘనంగా స్వాగతం చెప్తున్నాం". అందామె ఆనందంగా!

"చాలా సంతోషం. ఇంతకి మీ భాగ్యలక్ష్మిని చూపిస్తావా! లేదా?" నిలేసినట్లు అడిగిందామె.

"మా కోడలి పేరు భాగ్యలక్ష్మి కాదు. మహలక్ష్మి. మా ఇంటి మహలక్ష్మి అంది సుజాత!

"నీ కవిత్వానికి మెచ్చానుగాని, అసలు పేరేదో చెప్పు. లేకపోతే మనిషినన్నా చూపించు ' అంది సుమిత్ర నవ్వుతూ!

"తినబోతూ రుచులడగడం దేనికి? మరో ఐదు నిమిషాల్లో వస్తుందిగా! నువ్వే అన్ని ప్రశ్నలు వెయ్యి" అని కోడలిని తీసుకురావటానికి లోపల గదిలోకి వెళ్ళింది సుజాత!

వాళ్ళ మాటలు విన్న లలిత చిన్నగా నవ్వింది.

ఐదు నిమిషాల్లో కోడలిని తీసుకొచ్చి కుర్చీలో కూర్చొబెట్టింది

ఆ అమ్మాయిని చూడగానే, షాక్ తిన్నట్లయి పోయింది లలిత!

"ఒసేయ్ లలితా! ఈ అమ్మాయిని మన కిషోర్‌కి చేసుకుందామనుకొలేదు" అంది అన్నపూర్ణ నెమ్మదిగా!

"ఔనండి! ఆ అమ్మాయే!" అంది లలిత ఆశ్చర్యంగా!

"నీ పేరేమిటమ్మా!" అడిగింది సుమిత్ర!

"సౌమ్య!" అని తలదించుకుందా అమ్మాయి

ఆ మాట వినడంతోనే చెవులు దిమ్మెరెక్కినట్లయి పోయాయి అన్నపూర్ణకు

ఒకప్పుడు నష్ట జాతకురాలు! దురదృష్టవంతురాలు, అనుకున్న ఆ పిల్లే, ఈవేళ మా ఇంటి మహలక్ష్మి అని హారతులందుకుంటోంది ఈ విషయాన్ని జీర్ణించుకోలేక, బయటకు నడిచింది అన్నపూర్ణ.

ఇక అక్కడ ఒక్క క్షణం ఉండలేక, తనుకూడా అత్తగారి వెంట బయటకు నడిచింది లలిత!

ఆమె మనసులో ఆలోచనాతరంగాలు.

మారుతున్న ఈ సమాజంలో, మారలేని మూఢనమ్మకాలు ఎంతగా పాతుకుపోయాయో, ఇప్పుడే ప్రత్యక్షంగా తెలుసుకుంది ఒకప్పుడు తను అత్తగారితో వాదించింది కానీ పరిస్థితుల ప్రభావంవల్ల, తనలోనూ ఆ మూఢనమ్మకం వ్రేళ్ళు తన్నుకొని పాతుకుపోయింది.

ఈ రోజు ఏదో మంచి జరిగిందని, అందల మెక్కించిన ఈ మనుష్యులే, రేపు ఏదైనా కీడు జరిగితే, ఆ కొత్త కోడలినే ఆడిపోసుకుంటారు ఇప్పుడు మా ఇంటి మహలక్ష్మి అన్న ఆ నోరే, రేపొద్దున్న శనిగొట్టు మొహం అంటుంది వీటన్నిటికి అతీతంగా, ధైర్యంగా నిలబడే శక్తిని ఈ ఆడవాళ్ళకు ప్రసాదించి, వాళ్ళలో ఉన్న మూఢ నమ్మకాలని తొలగించు భగవంతుడా! అని మనసులో వేడుకుంది లలిత! □

